
సాక్షి ఒడిశా

సోమవారం । 3 । జూన్ । 2024




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ.6,29,994

బంగారం: 420 మిల్లీ గ్రాములు

వెండి: 8 గ్రాముల 750 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఈదురు గాలులతో వర్షం

కాల వైశాఖి ప్రభావంతో ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో ఈదురుగాలులతో పర్లా కిమిడిలో భారీ వర్షం కురిసింది. - 8లో



వడగాల్పులపై అప్రమత్తంగా ఉండాలి

వడగాల్పుల నుంచి రక్షణకు ప్రజలు తగు జాగ్రత్త చర్యలు పాటించాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

29 కేజీల గంజాయి స్వాధీనం

• ఒకరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితుడు రాయ్

జయపురం: నవరంగపూర్ జిల్లా మావో ప్రభావిత రాయిఘర్ సమితి ప్రాంతం నుంచి సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి తరచూ కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి గంజాయి తరలిస్తున్నారు. ఆదివారం ఉదయం ఆ రాష్ట్రానికి చెందిన ఫరస్‌గాం పోలీసులు రాయగడకు చెందిన అభిషేక్ రాయ్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి రవాణా జరుగుతున్నట్లు మందస్తు సమాచారం రావడంతో కొండాగాం జిల్లా ఫరస్‌గాం రహదారిపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అభిషేక్ రాయ్ ఒక బైక్‌పై వస్తుండగా పోలీసులు అడ్డగించి సోదా చేయగా 29 కేజీల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయి విలువ దాదాపు రూ.3 లక్షలు ఉంటుందని అంచనా. పోలీసులు గంజాయి, బైక్‌లను సీజ్ చేసి నిందితుడు అభిషేక్ రాయ్‌ని అరెస్టు చేశారు.

95 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపు

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమగ్రంగా 4 దశల్లో ముగిసింది. ఓట్లతో నిండిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉన్నాయి. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్ధారించిన ప్రకారం ఈ నెల 4న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నిండిన ఓట్లు లెక్కిస్తారు. ఈ మేరకు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు పురస్కరించుకుని ఆయా ప్రాంగణాల్లో 95 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సీఏపీఎఫ్) మోహరిస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) నికుంజ బిహారీ ధొలా ఆదివారం తెలిపారు. రాష్ట్రంలో నాలుగు దశల లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 185 సీఏపీఎఫ్ కంపెనీలు మోహరించినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రత కోసం స్ట్రాంగ్ రూమ్, లెక్కింపు కేంద్రాల్లో 25 కంపెనీల సీఏపీఎఫ్ సిబ్బంది ప్రత్యేకంగా నియమించారు. ఇప్పుడు, ఎన్నికల తర్వాత శాంతిభద్రతలను కాపాడేందుకు రాష్ట్రంలో అదనంగా 70 కంపెనీల సీఏపీఎఫ్ భద్రతా కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారని వివరించారు.

టవర్ ఎక్కి యువకుడి ఆత్మహత్య



టునా సుబుద్ధి(ఫైల్)

పర్లాకిమిడి: అందరూ చూస్తుండగానే సెల్ టవర్ మీద నుంచి దూకి ఒక యువకుడు ఆత్మ చేసుకున్న ఘటన ఖోజురిపద పోలీసుస్టేషన్ పరిధిలోని నువాగడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కుటుంబంలో కలహాలు వలన నువాగడ గ్రామానికి చెందిన టునా సుబుద్ధి (28) ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి, వెంటనే దూకేశాడు. దీంతో టునా సుబుద్ధి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే దగ్గరలో ఉన్నటువంటి ఖోజురిపద గోష్ఠి ఆరోగ్య కేంద్రంలో చేర్చిన తర్వాత మృతి చెందినట్టు డాక్టర్ మినాతి మహంతి తెలిపారు. అనంతరం సెరంగో, ఖోజురిపద పోలీసులు విచ్చేసి కేసు రిజిస్టరు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పర్లాకిమిడి ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఖోజురిపద పోలీసు అధికారి ప్రఫుల్ల జగరోంగో కేసును విచారిస్తున్నారు.

గమ్యం చేరిన పోలింగ్ సిబ్బంది



రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఈ బృహత్తర కార్యకలాపాల్లో సుదీర్ఘ, తీవ్రమైన ఒత్తిళ్ల మధ్య రాత్రింబవళ్లు శ్రమించిన పోలింగ్ సిబ్బంది క్రమంగా గమ్యస్థానాలకు చేరుతున్నారు. శనివారం పోలింగ్ ముగియడంతో ఆ రాత్రి నుంచి వీరంతా బయల్దేరినట్లు సీఈవో కార్యాలయ వర్గాల సమాచారం. భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో వీరందరి అవిశ్రాంత ప్రయత్నాలు అభినందనీయమని సీఈవో అధికార వర్గాలు ఆనందం వ్యక్తం చేశారు.

- భువనేశ్వర్

చివరి దశలో 71 శాతం పోలింగ్



భువనేశ్వర్: రాష్ట్రంలో చివరి దశ ఎన్నికల్లో పోలింగ్ చురుకుగా సాగింది. 6 లోక్‌సభ నియోజకవర్గాల్లో 70.67 శాతం, వాటి పరిధిలోని 42 అసెంబ్లీ సెగ్మెంట్లలో 72.37 శాతం పోలింగ్ జరిగింది. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సమాచారం ప్రకారం మయూర్‌భంజ్‌లో 73.81 శాతం, జగత్ సింగ్‌పూర్‌లో 73.06 శాతం, బాలాసోర్‌లో 70.41 శాతం, భద్రక్‌లో 70.34 శాతం, కేంద్రాపడాలో 68.64 శాతం, జాజ్‌పూర్‌లో దాదాపు 67.91 శాతం పోలింగ్ నమోదైంది. అసెంబ్లీ స్థానాల్లో బంగిరిపోషిలో అత్యధికంగా 77.52 శాతం, ఔల్ నియోజకవర్గంలో అత్యల్పంగా 62.38 శాతం ఓటింగ్ నమోదైంది. అన్ని దశల్లో సమగ్ర ఓటింగ్ శాతం కనీసం 75 శాతానికి చేరుకునే అవకాశం ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) నికుంజ బిహారీ ధొలా తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అంతర్గత లక్ష్యం మేరకు తుది గణాంకాల సంకలనం చేసిన తర్వాత నాలుగు దశల్లో సమగ్ర ఓటింగ్ శాతం దాదాపు 75 శాతానికి పెరుగుతుందని ఆయన అన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సమగ్ర పోలింగ్ 73 శాతానికి పరిమితమైంది.

తగ్గిన నేరాలు

తాజాగా ముగిసిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల నేరాలు 60 శాతం తక్కువగా నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇది రాష్ట్రంలో అత్యంత ప్రశాంతంగా జరిగే ఎన్నికల్లో ఒకటిగా నిలిచిందని సీఈవో నికుంజ బిహారీ ధొలా తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన, సోషల్ మీడియా నేరాలు, పోల్ సంబంధిత హింసతో సహా ఇతరతేర పోలింగ్ సంబంధిత నేరాలు 327 నమోదు కాగా ఈసారి 124 ఎన్నికల నేరాలు నమోదయ్యాయి. ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 285 అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలోని 20,000 ఆయుధాలలో 14,762 లైసెన్స్ ఉన్న తుపాకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. 80,000 మంది వ్యక్తులపై చట్ట ప్రకారంగా నేర నియంత్రణ, నివారణ సెక్షన్ల కింద చర్యలు చేపట్టడం ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి దోహదపడిందని సీఈఓ వివరించారు. రూ.20.52 కోట్ల నగదు, రూ.42.33 కోట్ల విలువైన మద్యం, రూ.78.82 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.14.70 కోట్ల విలువైన బంగారం తదితర సొత్తు, రూ.122 కోట్లకు పైగా విలువైన ఉచిత వస్తువులతో సహా ఎన్నికలకు సంబంధించిన జప్తు సమగ్రంగా దాదాపు రూ. 280 కోట్లుగా ఆయన పేర్కొన్నారు.

పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్

జయపురం: పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కలెక్టర్ వి.కీర్తి వాసన్ తెలియజేశారు. మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లపై కొరాపుట్ సద్భావన్ భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొరాపుట్ జిల్లాలో కొరాపుట్, లక్ష్మీపూర్, పొట్టంగి, జయపురం, కోట్‌పాడ్ విధాన సభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కొరాపుట్ ప్రభుత్వ కళాశాలలో కొరాపుట్, లక్ష్మీపూర్, పొట్టంగి అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని వెల్లడించారు. జయపురం, కోట్‌పాడ్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల బయట ఒడిశా పోలీసులు, మధ్యలో ఒడిశా సాయుధ పోలీసులు, లోపల కేంద్ర సాయుధ ఆర్మీ జవాన్లు భద్రత చేపడతారని పేర్కొన్నారు. ఇలా మూడంచెల రక్షణ వలయంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కొరాపుట్ ప్రభుత్వ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపు కోసం ప్రతీ నియోజకవర్గానికి 12 టేబుల్స్, జయపురం విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు కోసం ప్రతీ నియోజకవర్గానికి 10 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 5 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 56 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆరోజు సాయంత్రం 4.30 గంటల్లోపు 5 నియోజకవర్గాల ఫలితాలు వెల్లడి కావొచ్చని దీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కొరాపుట్ అదనపు జిల్లా కలెక్టర్ లగ్నజిత్ రౌత్, అలోమణి సెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ట్రక్కు బోల్తా



లోయలో పడిన ట్రక్కు



హెల్పర్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

పర్లాకిమిడి: గంజాం జిల్లా తప్తపాణి సమీపంలోని జుకుపల్లి వద్ద ఆదివారం ఒక పసుపు ట్రక్కు అదుపు తప్పి లోయలోకి పడిన ఘటనలో హెల్పర్ సురేష్ కుమార్ గురు మృత్యువాత పడ్డాడు. చాందిపుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గజపతి జిల్లా మోహనాలో పసుపును వ్యాపారులు కొనుగోలు చేసి బరంపురానికి తీసుకెళ్తున్నారు. తప్తపాణి సమీపంలో జుకుపల్లి ఘాట్ రోడ్డు దిగుతుండగా బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో లారీ సరుకుతో సహా లోయలోకి పడిపోయింది. దీంతో ట్రక్కులో ఉన్న హెల్పర్ సురేష్ కుమార్ గురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. డ్రైవర్ సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు. ప్రమాదం విషయం తెలియడంతో సంఘటన స్థలం వద్దకు అగ్నిమాపక దళం సిబ్బంది విచ్చేసి హెల్పర్ మృతదేహాన్ని బయటకు తీశారు. ట్రక్కును క్రేన్ల ద్వారా బయటకు తీశారు. గంజాం జిల్లా పుడామర్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు అనుమానాస్పద కేసులు నమోదు



ఆస్పత్రిలో గుర్తు తెలియని మృతదేహం



ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్న కుశ పాయిక్

జయపురం: సదరు పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం మూడు అనుమానాస్పద మృతి కేసులు నమోదయ్యాయి. జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం కాగా, కొలాబ్ ప్రధాన ఇరిగేషన్ కెనాల్‌లో స్థానిక భూపతివీధి నివాసి బి.శ్రీహరి(55) మృతదేహం తేలుతూ కనిపించింది. అలాగే జయపురం సమితి బరిణిపుట్ పంచాయతీ శుండిగుడ గ్రామానికి చెందిన కుశ పాయిక్(22) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పూల్‌బెడ ప్రాంతంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆహార కేంద్ర ప్రాంగణంలో గుర్తు తెలియని 50 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఆస్పత్రి వర్గాలకు కనిపించింది. అతడికి షర్ట్ లేదు, నల్లరంగు ఫ్యాంట్ వేసుకున్నాడు. డాక్టర్లు ఆ వ్యక్తి మరణించాడని ప్రకటించటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా స్థానిక కమల మెడికల్ సమీప భూపతివీధికి చెందిన బి.శ్రీహరి గత నెల 31వ తేదీన స్నానం చేసేందుకు వెళ్లి కెనాల్‌లో మునిగిపోయాడు. అతడు ఆ రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. అయితే అతడి మృతదేహం కుందారి గుడ సమీప కొలాబ్ ప్రధాన కెనాల్‌లో తేలుతూ కనిపించింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. అలాగే బరిణిపుట్ పంచాయతీ శుండిగుడలో కుశ పాయిక్ ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అది తెలిసిన అతడి కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ అతడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు వెల్లడించారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13కి చేరిన మృతుల సంఖ్య

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని చందన యాత్ర పురస్కరించుకుని నరేంద్ర సరోవరం తీరంలో చోటు చేసుకున్న విచారకర బాణాసంచా పేలుడు సంఘటనలో నిత్యం మృతుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా మరో 4 మంది గాయపడి కాలిన గాయాలతో ఆదివారం మరణించినట్లు అధికార వర్గాలు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య 13కి చేరుకుంది. రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సమాచారం ప్రకారం మరో 17 మంది బాధితులు ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు పూరి జిల్లా కలెక్టర్ చర్యలు చేపడుతున్నారు. బుధవారం నరేంద్ర సరోవరంలో జరిగిన స్వామివారి చందన యాత్రలో సంభవించిన బాణాసంచా పేలుడు సంఘటనలో తొలుత 3 మంది వ్యక్తులు మరణించారు. ఈ దశలో 30 మంది కాల్పులతో గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చేరారు. శుక్ర, శని వారాల్లో వరుసగా రెండు రోజులు 3 మంది చొప్పున కాలిన గాయాలతో మరణించారు. ఆదివారం నాటి మృతులతో సమగ్ర మృతుల సంఖ్య 13కి చేరింది.

మృతుల్లో చిన్నారులు

మృతుల్లో 18 నెలల పాప, నాలుగేళ్ల బాలిక, ఆరేళ్ల బాలిక, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. మిగతా వారు 15 నుంచి 38 ఏళ్ల మధ్య వయసు వారు ఉన్నారు. క్షతగాత్రులను మొదట పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్పించారు. అయితే వారి పరిస్థితి విషమించడంతో ప్రత్యేక చికిత్స కోసం కటక్‌లోని ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రికి, భువనేశ్వర్‌లోని పలు ఆస్పత్రులకు తరలించారు. పలువురు మైనర్లతో సహా గాయపడిన వారికి చికిత్స చేస్తున్న వైద్యులు సమాచారం ప్రకారం పలువురు 90 శాతం పైగా కాలిన గాయాలతో చికిత్స కోసం భర్తీ అయినట్లు తెలిపారు.

ఎస్‌ఆర్‌సీ విచారణ

ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్‌ఆర్‌సీ) సత్యబ్రత సాహు ఈనెల 5న పూరీ ప్రత్యేక సర్క్యూట్ హౌస్‌లో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు. చందన్‌యాత్ర సందర్భంగా నరేంద్ర సరోవరం తీరంలో వందలాది మంది భక్తులు గుమిగూడిన సమయంలో బాణసంచా కాల్చడం, పేలుడు ప్రమాదం ప్రేరేపించిన పరిస్థితులపై విచారణ చేపడతారు. గాయపడిన వారిలో అత్యధికులు నరేంద్ర సరోవరం పరిసరాల్లో ఖొండియా బొంధొ సాహికి చెందినవారు ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా అక్రమంగా పటాకులు పేల్చిన ఆరోపణ కింద చందన్ భొయ్‌పై పూరీ పోలీసులు స్వయంగా కేసు నమోదు చేశారు. విచారణ కొనసాగుతోంది.

వైద్యుడిని అపహరించిన మావోలు



వైద్యుడు అమ్లాన్ బోయి(ఫైల్)



అమ్లాన్ ఇంటి వద్ద పరిశీలిస్తున్న అధికారులు



కలిమెల ఆరోగ్య కేంద్రం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఆరోగ్య కేంద్రం వైద్యుడు అమ్లాన్ బోయిని శనివారం రాత్రి తన నివాసం నుంచి మావోలు అపహరించారు. అయితే తన సెల్‌ఫోన్, బైక్ ఇంటి వద్దనే ఉన్నాయి. ఆదివారం ఉదయం తోటి సిబ్బంది ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వచ్చి చూస్తే తలుపులు తీసే ఉన్నాయి. అయితే అమ్లాన్ ఇంటి లోపల మావోలు విడిచిపెట్టిన లేఖలు ఉన్నాయి. దీంతో వేంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మల్కన్‌గిరి ఎస్‌డీపీవో సేన్ పటేల్ స్వయంగా కలిమెల చేరుకొని మావోలు ఉంచిన లేఖను స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలో కలిమెల ఆరోగ్య కేంద్రంలో వైద్య సదుపాయాలు సరిగా లేవని, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తేనే విడిచిపెడతామని స్పష్టం చేశారు. అయితే ఆయన ఐదు నెలలు క్రితం కలిమెల ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. అతను కొందమాల్ జిల్లాకు చెందిన వ్యక్తి. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఎస్పీ నితీష్ వాద్వానీ మాట్లాడుతూ.. అమ్లాన్ కోసం వెదుకుతున్నామని పేర్కొన్నారు. ఆచూకీ లభిస్తే పూర్తి విషయాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

కలవరపెడుతున్న ఆంత్రాక్స్



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డాక్టర్లు



ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఆశవర్కర్లు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

జయపురం: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి ఎగువ కుంతియ గ్రామంలో ఆంత్రాక్స్ కలవరపెడుతోంది. గ్రామంలోని పశువుల్లో ఆంత్రాక్స్ వ్యాధి ఇటీవల కనిపించింది. అలాగే ఆ గ్రామంలోని ఇద్దరు వ్యక్తులకు ఆంత్రాక్స్ లక్షణాలు జిల్లా వైద్యాధికారులు గుర్తించారు. దీంతో వెంటనే అప్రమత్తమయ్యారు. గ్రామానికి వైద్య బృందంతో పాటు జిల్లా పశు వైద్య విభాగం టీమ్‌ను పంపించారు. పశు వైద్యాధికారి రబినారాయణ పండ నేతృత్వంలో పశు వైద్య బృందం ముందుగా గ్రామంలోని అన్ని పశువులకు ఆంత్రాక్స్ వ్యాధి నిరోధక టీకాలు వేసి, అవసరమైన మందులు ఇచ్చారు. జిల్లా ప్రధాన వైద్యాధికారి, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి రంజన్ మిశ్ర, డాక్టర్ జ్యోతిరంజన్ బిశ్వాల్ నేతృత్వంలో వైద్య బృందాలు ఆంత్రాక్స్ లక్షణాలు కనిపించిన ఇద్దరి నమూనాలు తీసుకొని పరీక్షలు నిర్వహించగా, వారిలో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు వైద్య బృందం వెల్లడించింది. దీంతో ఆశ కార్యకర్తలు, హెల్త్ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి మాంసం తినవద్దని ప్రజలను హెచ్చరించారు.

కనుల పండువగా శ్రీవారి వార్షికోత్సవం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం

భువనేశ్వర్: స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పూజాదులు చేపట్టారు. ప్రత్యేక సేవాదుల మధ్య భక్తులకు సర్వ దర్శనం సౌకర్యం కల్పించారు. సుప్రభాతం, తోమాల సేవ, సహస్ర నామ అర్చన, అగ్ని ప్రతిష్ఠ, కుంభారాధన, విశేష హోమం, అష్టోత్తర కలశ స్థాపన తిరుమంజనం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పూట స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వ దర్శనం కల్పించి ఏకాంత సేవ నిర్వహించడంతో వార్షికోత్సవానికి తెర పడింది. ఆలయం సూపరింటెండెంట్, స్థానిక సలహా మండలి అధ్యక్షుడు దాసరి మురళీ కృష్ణ, మాజీ సభ్యులు ఎస్. శాంతారామన్ తదితరులు వార్షికోత్సవం సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

ఫ్యూజ్ కాల్ కార్యాలయం ముట్టడి



టికిరి ఫ్యూజ్ కాల్ కార్యాలయానికి తాళం వేసిన యువకులు

రాయగడ: టీపీఎస్‌డీవోఎల్ విద్యుత్ సేవలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలే ఉక్కపోతతో తల్లడిల్లిపోతుంటే తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటుచేసుకుంటుండడం వలన టికిరిలో యువకులు అక్కడి ఫ్యూజ్ కాల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రతీ గంటలో కనీసం పదిసార్లు విద్యుత్ కట్ అవుతుండడంతో కంటిమీద కునుకు లేకుండా పోతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఆగ్రహించిన ప్రజలు ఈ మేరకు శనివారం సాయంత్రం టికిరిలోని విద్యుత్ శాఖకు సంబంధించిన ఫ్యూజ్ కాల్ కార్యాలయాన్ని ఘెరావ్ చేశారు. సిబ్బందిని రూమ్ లోపలే ఉంచి బయట నుంచి తాళాలు వేశారు. అదేతరహా రాయగడ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు ఎదురుగా గల ఫ్యూజ్ కాల్ కార్యాలయాన్ని ప్రజలు ఘెరావ్ చేయడంతో పాటు కార్యాలయంలోని కుర్చీలు, టేబుల్స్ తదితర పరికరాలను ధ్వంసం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ వారు నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు విద్యుత్ కోతలు తగ్గించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

మోడల్ లాసెట్‌కి మంచి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీఆర్ న్యాయ కళాశాలలో నిర్వహించిన మోడల్ లా సెట్ పరీక్షలకు మంచి స్పందన వచ్చింది. ఈ పరీక్షకు జిల్లా నలుమూలల నుంచి సుమారుగా 30 మంది వరకు హాజరయ్యారు. ఈ మోడల్ పరీక్ష తమకు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. నిర్వాహకులను ఎంపీఆర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మోషే అభినందించారు. కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, సీహెచ్ లక్ష్మణరావు, న్యాయవాదులు కొమ్ము రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కారులో ఒడిశా మద్యం పట్టివేత



అధికారులకు దొరికిన ఒడిశా మద్యం సీసాలు, కారు

ఇచ్ఛాపురం రూరల్: మారుతీ సుజుకీ కారులో 402 ఒడిశా మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్‌ఈబీ సీఐ విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పలాసలో ఎస్‌ఈబీ ఏఈఎస్ బేగం ఆధ్వర్యంలో కరాపాడు టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ కారులో మద్యం సీసాలు దొరికాయని, మద్యం సీసాలను, కారును స్వాధీనం చేసుకొని ముద్దాయిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. దాడిలో ఇచ్ఛాపురం ఎస్‌ఈబీ ఎస్‌ఐ కె.అనీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న మహారాష్ట్ర ఐఏఎస్ అధికారి



స్నేహాల్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ చంద్రశేఖర్, శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామిని మహారాష్ట్రకు చెందిన ఐఏఎస్ అధికారి స్నేహాల్ ప్రతాప్ భోస్లే ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈఓ ఎస్.చంద్రశేఖర్‌లు గౌరవ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. తాను తొలిసారిగా ఆదిత్యుని దర్శించుకున్నానని, ఎన్నో ఏళ్ల నుంచి మొక్కు చెల్లించేందుకు ప్రయత్నిస్తుంటే నేటికి సాధ్యమైందన్నారు. శంకరశర్మ ఆలయ విశిష్టతను వివరించారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు స్వల్ప విరామం



శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ మేరకు పాలిటెక్నిక్ ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ పాలీసెట్-2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో షెడ్యూల్ మేరకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్నారు. ఈ నెల 27వ తేదీన కౌన్సెలింగ్ ప్రారంభం కాగా, ఆదివారం 92001 నుంచి 108000 ర్యాంకు మధ్య విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సోమవారం నుంచి జరగాల్సిన కౌన్సెలింగ్ ప్రక్రియను ఆరో తేదీకి రీషెడ్యూల్ చేశారు. ఆరో తేదీన 108001 నుంచి చివరి ర్యాంకు వరకు విద్యార్థులు హాజరుకానున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

ఈదురు గాలులతో వర్షం



హైస్కూల్ జంక్షన్ వద్ద నేలకొరిగిన చెట్లు



పర్లాకిమిడి రాజవీధిలో పడుతున్న వర్షం

పర్లాకిమిడి: కాలవైశాఖి ప్రభావంతో ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో భారీ ఈదురు గాలులు, ఉరుములతో దాదాపు గంటసేపు పర్లాకిమిడిలో వర్షం కురిసింది. దీంతో మెడికల్ రోడ్డు, హైస్కూల్ జంక్షన్, పర్లాకిమిడి జాజిపూర్ రోడ్డలో అనేక చెట్లు నేలకూలాయి. హైస్కూల్ జంక్షన్ మరియు మార్కెట్ వద్ద ఉన్న ఫుట్‌పాత్ దుకాణాలు చెల్లాచెదురయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కొరగడంతో పర్లాకిమిడిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరలా ఉదయం విద్యుత్ సరఫరా పుణరుద్ధరణ అయ్యే అవకాశాలు ఉన్నట్లు టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ ఇంజినీర్లు చెబుతున్నారు.



పట్టణంలో హైస్కూల్ జంక్షన్ వద్ద కురుస్తున్న వర్షం



కాలేజ్ జంక్షన్ వద్ద అంధకారం

ఒక్క రోజు ఆదాయం రూ.9.57లక్షలు



సాధారణ క్యూలలో కిక్కిరిసిన భక్తులు



తలనీలాల మొక్కులకు బారులు తీరిన భక్తులు

అరసవల్లి: పవిత్ర వైశాఖ మాసం నాలుగో ఆదివారం సందర్భంగా అరసవల్లిలో వైశాఖాదిత్యుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఇతర జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక సంప్రదాయ పూజలను చేయించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతి ఇవ్వడంతో పాటు స్థానిక అసిరితల్లి అమ్మవారి ఆలయం పక్క నుంచి ఇంద్రపుష్కరిణికి ఈశాన్య ద్వారాల నుంచి రూ.100, ఉచిత దర్శనాలు, విశిష్ట దర్శనం (రూ.500)లకు వచ్చే భక్తులకు ప్రవేశాన్ని కల్పించారు. పుష్కరిణి వద్ద నుంచి ప్రత్యేక మార్గాల ద్వారా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ మార్గాల్లో భక్తులకు ఎండ వేడిమి నుంచి రక్షణ కల్పించేందుకు ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆదివారం ఒక్క రోజులోనే రూ. 9.76లక్షలు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలియజేసారు. దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.8.57లక్షలు, విరాళాల ద్వారా రూ. 83,044, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.20లక్షలు వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ తెలియజేశారు.



అటవీ శాఖ అధికారులు తొట్టెల్లోకి నీటిని నింపుతున్న ఈ ప్రాంతం అంతరాబ ఫారెస్ట్ బీట్ పరిధిలో ఉంది. వెడల్పుగా నిర్మించిన ఈ తొట్టెల్లోకి వారంలో రెండు సార్లు నీటిని నింపుతుండటంతో వన్యప్రాణులకు దాహం కష్టాలు తీరుతున్నాయి. అటవీ ప్రాంతం మొత్తం ఇలాంటి తొట్టెలు నెలకొల్పడంతో ఎండల నుంచి వన్యప్రాణులు కొంత వరకు ఉపశమనం పొందుతున్నాయి.



అడవికి అండ

- వన్య ప్రాణుల దాహార్తి తీర్చేలా అటవీ శాఖ ప్రత్యేక చర్యలు
- విస్తృతంగా నీటి తొట్టెలు, సాసర్ రింగ్స్ ఏర్పాటు
- ఇప్పటికే 60 నీటి తొట్టెల ఏర్పాటు

పాతపట్నం:

మండు వేసవిలో అడవి జంతువుల దాహం తీర్చేందుకు అటవీ శాఖ నడుం బిగించింది. వన్యప్రాణులు నీటిని వెతుక్కుంటూ ఊళ్లపైకి రాకుండా అడవిలోనే నీటి వనరులు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వేసవి వచ్చిందంటే చాలు నీరు, ఆహారం దొరక్క వన్యప్రాణులు జనారణ్యంలోకి రావడం, మృత్యువాత పడటం, అడవుల్లో అగ్ని మంటల్లో చిక్కడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో వన్య ప్రాణుల రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అటవీ శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. వన్యప్రాణుల దాహం తీర్చడంతో పాటు అడవుల సంరక్షణకు విశేష కృషి చేస్తోంది.

గొంతు తడిపేదిలా..



ఫారెస్ట్‌లో వన్యప్రాణుల కోసం చెట్లకు ఏర్పాటు చేసిన సాల్ట్ సాసర్స్

అడవుల్లో ఫైర్‌లైన్ ఏర్పాటు చేసి వృక్ష, జంతుజాలానికి రక్షణ కల్పిస్తున్నారు. అలాగే వన్యప్రాణుల సౌకర్యార్థం అదనంగా చెక్‌డ్యామ్‌లు, ఫారం పాండ్లు, సాసర్ రింగ్స్ లాంటివి ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంకర్లు, మోటార్ పైపుల ద్వారా నీటిని నింపుతూ వన్యప్రాణుల గొంతు తడుపుతున్నారు. కంపా నిధుల ద్వారా అడవుల సంరక్షణకు అటవీశాఖ చేస్తున్న పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలోని నాలుగు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో 64,400 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పాతపట్నం, కాశీబుగ్గ రేంజ్‌లు ఉన్నాయి. పాతపట్నం ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో జింకల సంచారం పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

60 తొట్టెల ఏర్పాటు..



అడవిలో నీటి తొట్టెను పైప్‌తో నింపుతున్న అటవీ శాఖ అధికారులు

జిల్లాలోని అన్ని ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని బిట్లలో సుమారు 60 నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వన్యప్రాణులకు సమృద్ధిగా తాగునీరు అందిస్తున్నారు. మరిన్ని సాసర్ పిట్స్, చెక్‌డ్యామ్‌లు, స్టెచ్చర్, పెర్కొలేషన్ ట్యాంకులు, నీటి కుంటల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారు.


అడవుల సంరక్షణపై అవగాహన

అడవుల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన అవసరం. వేసవి వచ్చిందంటే కార్చిచ్చు బారిన పడి పచ్చ సంపద కాస్త బుగ్గిపాలవుతుంది. సమీపాన ఉన్న ప్రజలకు అడవుల సంరక్షణ, ప్రాముఖ్యతపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాపరులను కేవలం పశువుల మేత మేపేందుకు మాత్రమే అనుమతిస్తున్నారు. ఇతరులను అడవుల్లోకి వెళ్లనీకుండా అడ్డుకుంటున్నారు. అటవీ సంపద మంటల పాలు కాకుండా ఫైర్‌లైన్ల నిర్వహణపై దృష్టి పెట్టారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా వచ్చే మెసేజ్ అలర్ట్‌తో ఆ ప్రాంతానికి చేరుకుని మంటలను నివారించేలా ఫైర్ బోయర్లను అందుబాటులో ఉంచారు.

అడవుల్లో వన్య ప్రాణుల సందడి

జిల్లాలోని నాలుగు ఫారెస్ట్ ప్రాంతాల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. దుప్పులు, కుందేళ్లు, జింకలు, నెమళ్లు, అడవి పందులు, పక్షులు ఎక్కువగా ఉన్నాయి. జగనన్న పచ్చ తోరణంలో భాగంగా జంతువులు, పక్షుల కోసం ఎక్కువగా నేరేడు, ఉసిరి, మారేడు, వెలమ, చింత, వేప, రావి, మర్రి వంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా మరిన్ని ప్రాంతాల్లో ఎర్రమద్ది, నల్లమద్ది, సిందుగ, లోలుగ వంటి విత్తనాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

అడవుల విస్తరణకు కృషి



అడవులు, వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత, అడవుల విస్తరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పలు జాతులకు చెందిన మొక్కలను పెంపొందించేలా కృషి చేస్తున్నాం. అడవులు, వన్యప్రాణులకు ముప్పు కల్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా అడవుల్లో సంచరించకూడదు. జంతువులను వేటాడి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– ఆర్.రాజశేఖర్,ఫారెస్ట్ రేంజర్, పాతపట్నం

వడగాల్పులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్

- కలెక్టర్ మహాజన్

రాయగడ: గత కొద్ది రోజులుగా భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిలలాడుతున్నారని, వడగాల్పుల నుంచి ప్రజలు తగు జాగ్రత్త చర్యలు పాటించాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. వేసవి తాపంపై అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహాజన్ మాట్లాడుతూ వేసవి తాపం, వడగాల్పుల విషయమై ప్రజలకు అవగాహన కలిగించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో తాగునీటి కేంద్రాలు(చలివేంద్రాలు)ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించి నీటి ఎద్దడిని నివారించాలన్నారు. ప్రజారోగ్య, గ్రామీణ నీటిసరఫరా శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ అధికారులు తగిన మోతాదులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఉంచుకోవాలని, అవసరమైన వారికి వాటిని పంపిణీ చేయాలన్నారు. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రయాణాలు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి, ఏడీఎం భాస్కర రైతా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

పెరుగుతున్న వడదెబ్బ మృతుల సంఖ్య

భువనేశ్వర్: రాష్ట్రంలో వడదెబ్బ మృతుల సంఖ్య క్రమంగా నిర్ధారణ అవుతోంది. ఈ నేపథ్యంలో వడదెబ్బ మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సంబల్‌పూర్‌లో గత నాలుగు రోజుల్లో మొత్తం 18 మంది అసహజ మరణాలు సంభవించాయని సంబల్‌పూర్ కలెక్టర్ అక్షయ్ సునీల్ అగర్వాల్ ఆదివారం తెలిపారు. గత నెల 29 మరియు జూన్ 1 మధ్య మొత్తం 18 అసహజ మరణాలు నమోదయ్యాయి. వీటిలో ఐదు వడదెబ్బ సంబంధిత మరణాలుగా నిర్ధారించబడినట్లు ప్రకటించారు. 7 మంది మృతుల పోస్టుమార్టం నిర్వహించగా 5 మంది వడదెబ్బతో మృతి చెందినట్లు తేలిందన్నారు. మరో 11 కేసులకు సంబంధించిన పోస్ట్‌మార్టం నివేదికలు రావాల్సి ఉందని తెలిపారు.

రౌర్కెలాలో వడదెబ్బ వైపరీత్యం

ఉక్కు నగరం రౌర్కెలాలో గత 4 రోజుల్లో మొత్తం 35 అనుమానాస్పద వడదెబ్బ మరణాలు నమోదయ్యాయని అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఏడీఎం మరియు రూర్కెలా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశుతోష్ కులకర్ణి ఆదివారం తెలిపారు. వీరిలో కొందరు ఆస్పత్రులకు తరలించేలోపే మరణించినట్లు ప్రకటించగా, మరికొందరు చికిత్స పొందుతూ మరణించారన్నారు. నలుగురి కుటుంబీకులు మృతదేహాలను పోస్టుమార్టం చేయకుండానే తీసుకెళ్లారని తెలిపారు. ఇటువంటి సందర్భాలలో నిబంధనల ప్రకారం, మరణానికి కారణాన్ని నిర్ధారించడానికి తహసీల్దార్ మరియు వైద్య అధికారి సంయుక్త విచారణ నిర్వహిస్తారన్నారు. మిగిలిన 31 మందిలో, 24 మంది పోస్టుమార్టం నివేదికలు వచ్చాయి. వారిలో ఆరుగురు వడదెబ్బతో మరణించినట్లు నిర్ధారించారు.

15 కేసుల్లో పోస్టుమార్టం నివేదిక చేరాల్సి ఉంది. ఈ నివేదిక ఆధారంగా తదుపరి మృతుల వివరాలు స్పష్టం అవుతాయన్నారు. ఈ ఏడాది వేసవిలో 96 అసహజ మరణాలు నమోదయ్యాయి. వారిలో 9 మంది వడదెబ్బ కారణంగా మరణించారని రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. గత నెల 30 వరకు నమోదైన 42 మరణాలలో 6 వడదెబ్బ కారణంగా సంభవించగా, గత 48 గంటల్లో నమోదైన 54 మరణాలలో మరో 3 వేడిగాలుల సంబంధిత మరణాలు ఉన్నాయని అధికారిక ప్రకటన తెలిపింది.

సముద్ర స్నానానికి వెళ్లి విద్యార్థి మృతి

- భావనపాడులో ఘటన
- మృతునిది సారవకోట మండలం మర్రిపాడు
- ఒకే ఏడాది కుమార్తె, కుమారుడు మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



జన్ని ఉపేంద్ర (ఫైల్)

సంతబొమ్మాళి/సారవకోట: సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలో స్నానానికి వెళ్లి.. సారవకోట మండలం కూర్మనాథపురం పంచాయతీ మర్రిపాడు గ్రామానికి చెందిన జన్ని ఉపేంద్ర(17) ఆదివారం మృతి చెందాడు. మర్రిపాడు గ్రామానికి చెందిన సుమారు 40 మంది ట్రాక్టర్, ఆటోల్లో భావనపాడు బీచ్‌కు వెళ్లారు. మర్రిపాడు గ్రామానికి చెందిన చలపతిరావు, అప్పలయ్య కుమారుడు ఉపేంద్ర కూడా వారితో వెళ్లాడు. బంధువుల పిల్లలు మేఘన, దీపిక, కల్పనలతో కలిసి సముద్రంలోకి దిగాడు. కెరటాలు ఉధృతంగా రావడంతో ఆ ముగ్గురు పిల్లలు లోపలకు వెళ్లడం గమనించిన ఉపేంద్ర కేకలు వేస్తూ తాను కూడా లోపలకు వెళ్లిపోయాడు. వారితో ఉన్న తోటి గ్రామస్తులు ముగ్గురు పిల్లల్ని రక్షించారు. కానీ ఉపేంద్రను ఎవరూ గమనించలేదు. కాసేపటికి ఉపేంద్ర మృతదేహం తీరానికి కొట్టుకునివచ్చింది. దీంతో అంతా నిశ్చేష్టులైపోయారు. దీనిపై నౌపడ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు మెరైన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మెరైన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఘటనపై నౌపడ ఎస్‌ఐ కిశోర్ వర్మ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు పలాసలో ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

ఒకే ఏడాది కుమార్తె, కుమారుడు మృతి

చలపతిరావు, అప్పలమ్మ పెద్దకుమార్తె మీనా ఈ ఏడాది జనవరిలో విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆదివారం ఉపేంద్ర కూడా సముద్రంలో మునిగి చనిపోయాడు. దీంతో ఆ తల్లిదండ్రులకు దుఃఖానికి అంతు లేకుండా పోయింది. కొడుకును పోగొట్టుకున్న బాధలో వారు కన్నీరుమున్నీరయ్యారు.

‘దమనకాండను ఖండించండి’



సమావేశంలో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకుడు దానేసు

పలాస: దండకారణ్యంలో కేంద్ర పోలీసు బలగాలు ‘కగార్’ పేరుతో చేపడుతున్న దారుణ దమనకాండను పౌర సమాజం ఖండించాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బొడ్డపాడులో ఆదివారం పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు దానేసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని దండకారణ్యంలో ఆదివాసీల హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఇటీవల గత కొంత కాలంగా అక్కడ జరుగుతున్న హింసాత్మక సంఘటనలను పరిశీలించడానికి గత నెల 29న నిజ నిర్ధారణ కమిటీ ప్రతినిధులు వెళ్లగా చత్తీస్‌గఢ్ ప్రభుత్వం, అక్కడ పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారని, వారిని వెనక్కి పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దండకారణ్యంలో 120 మంది అమాయకులైన ఆదివాసీలను, కొంతమంది మావోయిస్టులను పట్టుకుని కాల్చిచంపారని, అక్కడ ఒక భయానక వాతావరణాన్ని సృష్టించార ని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కావాలని, అందుకు ప్రతి ఒక్కరు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని కోరారు. సమావేశంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు తామాడ సన్యాసిరావు, న్యూడెమొక్రసీ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, పీఓడబ్ల్యూ నాయకురాలు పోతనపల్లి కుసుమ, పోతనపల్లి కామేశ్వరరావు, మద్దిల రామారావు, దుష్యంతు, ఢిల్లీరావు, జగదీష్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నర్సిపురంలో దొంగతనం



ఇంటిని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై దినకర్

పార్వతీపురం టౌన్: మండలంలోని నర్సిపురం ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. రూరల్ ఎస్సై దినకర్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి గంట లాజరు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి బయట వరండాలో పడుకున్నాడు. అర్ధరాత్రి చలి వేయడంతో దుప్పటి తెమ్మని భార్యకు చెప్పగా, ఆమె ఇంటిలోకి వెళ్లే సరికి బెడ్‌రూమ్‌లో ఉన్న వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులందరూ వచ్చారు. అయితే అప్పటికే దొంగలు పరారయ్యారు. సెల్ఫ్ ఆల్మరాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి పట్టీలు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 13,500 నగదు పోయినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య



మృతురాలు చోడిపల్లి ఉష (ఫైల్)

సాలూరు: యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కరాసవలస పంచాయతీ గడివలస గ్రామానికి చెందిన చోడిపల్లి ఉష (20) పట్టణంలోని ప్యారడైజ్ హోటల్‌లో పని చేస్తోంది. అదే హోటల్‌లో పనిచేస్తున్న మరో ఇద్దరు యువతులతో కలిసి ఆమె పట్టణంలోని గొర్లెవీధిలో అద్దె ఇంటిలో ఉంటోంది. ఆదివారం సాయంత్రం అద్దె ఇంటిలోనే ఉష చున్నీతో ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



కర్రి శివప్రసాద్ (ఫైల్)



దేబార్కి శరత్‌కుమార్ (ఫైల్)



ప్రమాద స్థలంలో శివప్రసాద్, శరత్‌కుమార్ మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై కృష్ణమూర్తి

డెంకాడ: మండలంలోని బొడ్డవలస పెంట్రోల్ బంక్ సమీపంలో విజయనగరం – విశాఖ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతలవలస గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కర్రి శివప్రసాద్, దేబార్కి శరత్‌కుమార్ మంచి స్నేహితులు. ఇద్దరూ వ్యక్తిగత పనిమీద భీమునిపట్నం వెళ్లి అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై శనివారం అర్ధరాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. సరిగ్గా ఒంటిగంట ప్రాంతంలో బొడ్డవలస పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు టైల్స్ పని చేస్తూ కుటుంబాలకు అండగా ఉంటున్నారు. శరత్‌కుమార్‌కు తల్లి, తమ్ముడు.. కర్రి శివప్రసాద్‌కు తల్లి, అక్క ఉన్నారు. చేతికి అందివచ్చిన కొడుకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్సై కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాసంగి ముంపులో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి ముంపు ప్రాంతంలో ఏనుగులు జలకాలాడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు ముంపులో ఉండి సాయంత్రానికి వెంకటరాజపురం, నిమ్మలపాడు గ్రామాల్లోని అరటి, పామాయిల్ తోటల్లోకి జారుకున్నాయి. అరటి పంటను ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇంటికి వచ్చే సమయానికి పంట నేలకొరగడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏనుగులను తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

క్రీడాకారుల అడ్డా సిరిపురం...

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు
- సహకారం అందిస్తున్న గ్రామస్తులు



2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం క్రీడాకారుల అడ్డాగా నిలుస్తోంది. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి సంవత్సరం వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని అధిక సంఖ్యలో విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక్కడ శిక్షణ పొందే విద్యార్థులకు పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. యూనిఫారాలతో పాటు ప్రతిరోజూ ఉడకబెట్టిన గుడ్లు, న్యూట్రిషియన్ బిస్కెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమకూరుస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని హెచ్ఎం వి.వెంకటరావు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులే అయినప్పటికీ పీడీలు కె.సన్నిబాబు, బుజ్జి పర్యవేక్షణలో అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, త్రో బాల్, యోగాలలో శిక్షణ తీసుకుంటూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో రాణిస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ శిక్షణ పొందిన వారిలో సుమారు వంద మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో, పది మంది జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడలకు 19 మంది, వాలీబాల్‌కు ఒక అమ్మాయి, ఖోఖోకు ఒకరు, స్విమ్మింగ్‌కు ఒకరు ఎంపికయ్యారు.

పీడీల సహకారం మరువలేనిది...



పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాను. శిక్షణలో పీడీలు అందిస్తున్న సహాయ, సహకారాలు మరువలేం. ప్రతి సంవత్సరం వేసవి క్రీడా శిక్షణలో ఖోఖోలో మెలకువలు నేర్చుకుంటున్నాను. గత నవంబర్‌లో స్కూల్ గేమ్స్ అండర్ – 14 విభాగంలో చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరిగిన పోటీలలో పాల్గొన్నాను. మా జట్టు ద్వితీయ స్థానం సాధించింది.

– యలమంచిలి యోచన, ఖోఖో క్రీడాకారిణి

శిక్షణ ఎంతో ఉపయోగపడింది...



ఆరో తరగతి నుంచి ప్రతి ఏటా సిరిపురం హైస్కూల్‌లో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొని అథ్లెటిక్స్‌లో మెలకువలు నేర్చుకుంటున్నాను. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాను. ఏలూరు, గుంటూరు, తిరుపతి, శ్రీకాకుళం, ఏఎన్‌యూ, నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని 800 మీటర్ల రన్నింగ్‌లో పదిసార్లు మెడల్స్ సాధించాను. ఇటీవల జనవరిలో అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి 800 రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నాను.

– ఎస్. సమీర, అథ్లెటిక్

శిక్షణ బాగుంది..



ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్నాను. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరం చాలా బాగుంది. అథ్లెటిక్స్ అంటే చాలా ఇష్టం. అథ్లెటిక్స్‌లో మెలకువలు నేర్చుకుంటున్నాను. అహ్మదాబాద్‌లో జరిగిన అండర్ – 19 జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొన్నాను

– బాలాంజలి, క్రీడాకారిణి

సహకారం మరువలేనిది



తల్లిదండ్రులు, హెచ్ఎం, దాతల సహకారం మరువలేనిది. గడిచిన ఏడు సంవత్సరాల నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాం. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణిస్తున్నారు. ఎంతోమంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం ఆనందంగా ఉంది.

– కె.సన్నిబాబు, పీడీ

పిడుగుపాటుకు పది గొర్రెల మృతి



పిడుగు పాటుతో మృతిచెందిన గొర్రెలు

వంగర: మండల పరిధి పట్టువర్ధనం గ్రామ సమీపంలో గొర్రెల మందపై పిడుగుపడడంతో పది గొర్రెలు మృతిచెందాయి. ఆదివారం రాత్రి భారీ ఉరుములతో కూడిన వర్షం కురవడంతో సమీప పంటపొలాల్లో గొర్రెల మంద పై పిడుగులు పడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన చిన్ని గంగులు 10 గొర్రెలు మృతిచెందాయి. ఈ నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

చేపల వర్తకులపై కేసు నమోదు



కేసులు నమోదు చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 100 ఫీట్ రింగురోడ్డులో ఉన్నన పలు దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలు అతిక్రమిస్తూ తూనికల రాళ్లతో వినియోగదారులను మోసగిస్తున్న ముగ్గురు చేపల వర్తకులపై కేసులు నమోదు చేశారు. గతంలో కూడా ఇదే వర్తకులపై కేసులు నమోదయినట్లు తెలిపారు. మరోసారి ఇటువంటి మోసాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని వర్తకులను హెచ్చరించారు. తూనికల్లో జరిగే మోసాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా మోసాలు గుర్తిస్తే తమ శాఖకు తెలియజేయాలని ఎస్సై ఎం.దామోదరనాయుడు కోరారు.

శ్రీరామ చక్రధర్‌కు సత్కారం



తవాస్మి బృంద సభ్యులను సత్కరిస్తున్న ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్

విజయనగరం రూరల్: రామాయణంపై 10 ఏళ్లుగా పరిశోధనలు చేస్తున్న తవాస్మి, మనస్వి, తపస్వి పుస్తక రచయత శ్రీరామ చక్రధర్‌ను ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ ఆదివారం ఘనంగా సత్కరించారు. హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా రామనారాయణంలో తవాస్మి బృదం ఆధ్వర్యంలో రామాయణం ఆవశ్యకతను పిల్లలకు, పెద్దలకు వివరిస్తూ 6 రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. తవాస్మి బృదం సేవలను గుర్తిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామా చక్రధర్ మాట్లాడుతూ.. రామాయణం మన ఇతిహాసం(చరిత్ర), మనిషికి మానవత్వాన్ని పరిచయం చేసి వారిని వీరులుగా, ధీరులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడే ఉత్తమ గ్రంథమన్నారు. రామాయనంలోని అంశాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్లు రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్, తదితరులు

విజయనగరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, చేతివృత్తుల ద్వారా స్వయం ఉపాధి పొందాలని ఎన్‌సీఎస్ గ్రూపు అధినేత నారాయణం శ్రీనివాస్ అన్నారు. ఆర్యవైశ్య వెల్ఫేయిర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బలిజవీధి సంఘం భవనం వద్ద ఆదివారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఈ కుట్టు శిక్షణ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని నానాజీ మాట్లాడుతూ.. ప్రస్తుతం 54 మంది మహిళలకు శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కస్పా ఆర్యవైశ్య సంఘం నూతన భవన నిర్మాణానికి రూ.10 లక్షలను సంఘం తరపున విరాళంగా అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి పేర్ల సీతారామయ్య శెట్టి, కోశాధికారి కందుల సంతోష్, వెత్సా శ్రీనివాసరావు, పలివెల శ్రీనివాస్, అక్షింతల సతీష్, శిరం గవరరాజు, కంచెర్ల ప్రకాష్, గుంపిన నారాయణరావు, మండవిల్లి వెంకటరాజు, జనార్ధనరావు, రత్నారావు, కుట్టు శిక్షణ శిక్షకురాలు శారద, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- ఆర్‌ఓబీ రెయిలింగ్‌ను ఢీకొన్న బొలేరో



ప్రమాదంలో క్షతగాత్రుడు చంటి, రైయిలింగ్ పైకి దూసుకెళ్లిన బొలేరో

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి రైల్వే ఓవర్ బ్రిడ్జిపై (ఆర్‌ఓబీ) శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనచోదకుడు గాయాలపాలై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎల్.దామోధరరావు తెలిపిన వివరాల మేరకు.. చీపురుపల్లి వైపు నుంచి విజయనగరం వైపు రాత్రి 11:30 గంటల ప్రాంతంలో బొలేరో వాహనం వెళ్తుండగా.. అదే సమయంలో విజయనగరం వైపు నుంచి చీపురుపల్లి వైపు జి.సిగడాం మండలం గెడ్డ కంచరాం గ్రామానికి చెందిన చంటి అనే వ్యక్తి బైక్‌పై ఎదురుగా వస్తున్నాడు. ఈ సమయంలో బొలేరో వాహనం నడుపుతున్న డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా.. బొలేరో వాహనం అదుపు తప్పి ఆర్‌ఓబీ రెయిలింగ్‌పైకి దూసుకెళ్లింది. రెయిలింగ్ పిల్లర్లు కూలి ఆర్‌ఓబీ కింద నున్న ప్రధాన రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో తారురోడ్డుపై ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇదిలా ఉంటే బొలేరే వాహనం డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడతో ద్విచక్ర వాహనదారుడు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడిన వాహనదారుడ్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఎస్సై దామోధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులే కీలకం..



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ


- ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ

విజయనగరం అర్బన్: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకమని, ఆ దిశగా ప్రభుత్వాలు వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ అన్నారు. ఆదివారం స్థానిక పీఎస్ఆర్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యరంగ అభివృద్ధిలో ఉపాధ్యాయులే ప్రధానపాత్ర పోషించాలని సూచించారు. ఏకీకృత సర్వీస్ సాధన కోసం ఆపస్ కృషి చేస్తోందని చెప్పారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వీవీజే సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి ఈ.రాముయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రమణ, కె.సంతోషలక్ష్మి, కోశాధికారి ఏజీ తాతారావు, మహిళా కన్వీనర్ జి.పద్మలత, ముగడ రమణ, కెల్ల భాస్కరరావు, కె.సాయికుమార్, కె.శివప్రసాద్, ఎస్.నారాయణరావు, వీవీ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షునిపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు టి.వి.దుర్గారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఓ మహిళను వెంబడిస్తూ వేధించినందుకు అతం మోహన్ అనే అతన్ని పిలిచి మందలించారని, అందుకు ప్రతీకారంగా సూరిబాబుపై అతం మోహన్, అతం ప్రసాద్, మరో వ్యక్తితో కలిసి మారణాయుధాలతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిని సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పోలీసులు స్పందించి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు.

వీరఘట్టంలో భారీ వర్షం



ప్రధాన రహదారిలో రాత్రి 8.30 గంటల సమయంలో ఉరుములతో పట్టపగల్లా ఉన్న వాతావరణం

- ఉరుములు, మెరుపులతో దద్దరిల్లిన ఆకాశం
- పోలీస్‌స్టేషన్ ఆవరణలో పడిన పిడుగు
- సమీప 50 గృహాల్లో కాలిపోయిన ఇన్వర్టర్లు

వీరఘట్టం: గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదివారం రాత్రి సుమారు 7.30 గంటల నుంచి 8.45 గంటల వరకు భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులతో భారీ పిడుగులు సమీప పంట పొలాల్లో పడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పిడుగుపడి ఓ చెట్టు కూలిపోయింది. అంతేకాకుండా పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న సుమారు 50 గృహాల్లో ఇన్వర్టర్లు కాలిపోయాయి. పిడుగుపాటుకు ఎటువంటి ప్రాణహాని జరగనప్పటికీ ప్రజలు భయంతో వణికిపోయారు. ఏది ఏమైనప్పటికీ పగలంతా ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

సీఓపీడీ ప్రాణాంతకం..

- పెరుగుతున్న కేసులు
- దగ్గు, ఆయాసం ఉన్న వారిలోఅధికం
- ప్రతి 10 మందిలో 8 మందికి నిర్ధారణ
- జిల్లాలో 40 శాతం మందికి పైగా సీఓపీడీ వ్యాధిగ్రస్తులు
- ఏటా 15 వేల వరకు కేసుల నమోదు
- మూడో ప్రాణంతక వ్యాధిగా పరిగణింపు



పొగ తాగుతున్న వ్యక్తి



సీఓపీడీ రోగిని పరిక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే క్షయ, కుష్టు, హెచ్ఐవీ వ్యాధులను అదుపు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొచ్చి ప్రాణాంతకంగా మారుతున్నాయి. మూడేళ్ల కిందట కరోనా విలయ తాండం వచేసి ప్రజలను వణికించింది. తాజాగా సీఓపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) రోజు రోజుకూ విస్తరించి, ప్రమాదకరంగా మారుతోంది. జిల్లాలో వేలాది మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. అదేవిధంగా రోజు రోజుకూ కేసుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయం. ప్రపంచంలోనే మూడో ప్రాణంతక వ్యాధిగా దీన్ని పరిగణిస్తున్నారు. జిల్లాలో ఏటా 15 వేల వరకు సీఓపీడీ కేసులు నమోదవుతున్నాయి.

పొగ తాగడం, పీల్చడం వల్లే వ్యాప్తి..

పొగ తాగడం వల్ల , పొగ తాగే వ్యక్తి పక్కన ఉండడం వల్ల సీఓపీడీ వ్యాధి వ్యాపిస్తుంది. ముఖ్యంగా అడ్డపొగ తాగే వారిలో ఎక్కువగా ఈ వ్యాధి కనిపిస్తుంది. గోధుమ రంగులో కఫం పడడం, ఆయాసం, దగ్గు ఈ వ్యాధి లక్షణాలు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడంలో జాప్యం జరిగితే గుండెపై ప్రభావం పడి ప్రాణాల మీదకు వస్తుంది. ఒకసారి వ్యాధి సోకితే జీవితాంతం చికిత్స తీసుకోవాల్సిందే. సీఓపీడీ సోకిన వారు సకాలంలో వైద్యుడ్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

జిల్లాలో 40 శాతానికి పైగా వ్యాప్తి..

సీఓపీడీ వ్యాధి జిల్లాలో అధికంగా ఉంది. 40 శాతానికి పైగా ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంతవరకు పలమనాలజీ సేవలు అందుబాటులో లేక పోవడం వల్ల ఈ వ్యాధి గుర్తింపు పెద్దగా జరగలేదు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రస్తుతం పలమనాలజీ సేవలు అందుబాటులోకి రావడంతో వ్యాధిగ్రస్తుల గుర్తింపు జరుగుతోంది. దగ్గు, ఆయాసంతో వచ్చిన ప్రతి 10 మందిలో 8 మందికి సీఓపీడీ నిర్ధారణ అవుతోంది.

పొగతాగడం మానేయాలి..



సీఓపీడీ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే పొగ తాగడం పూర్తిగా మానేయాలి. అదేవిధంగా పొగతాగే వారి పక్కన కూడా ఉండకూడదు. సకాలంలో వైద్యం చేయించుకోవాలి. సీఓపీడీ ప్రాణంతకమైన వ్యాధి. జిల్లాలో అధికంగా కేసులు వస్తున్నాయి.

– డాక్టర్ బొత్స సంతోష్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఆదివాసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందుకుంటున్న ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు

విజయనగరం అర్బన్: ఆదివాసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ ఉద్యోగుల ఫెడరేషన్ ఆర్గనైజర్, ముంబై సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ చేతన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయనగరంలో ఉన్న ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావును ఫెడరేషన్ ఆర్గనైజర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉద్యోగులు జాతీయస్థాయిలో ఎదుర్కొంట్ను సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వచ్చే నెలలో జరగబోయే సదస్సుకు అతిథిగా ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ రామారావు దొర మన్యం జిల్లా ఆదివాసీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు సోమేలి సింహాచలం, ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గనైజర్ ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యులు సుబ్లారి గురదొర, చెర్రీకి సింహాచలం, వంతం కామేశ్వరరావు, మాసాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.